
www.prajasakti.com

ప్రజాశక్తి

శుక్రవారం 22 నవంబర్ 2024

5

డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ



21 మందికి కంటి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

మండలంలోని అంగర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో బలుసు రుద్రయ్య మెమో రియల్ ట్రస్ట్ నూతన భవనములో గురువారం ఉచిత కంటి వైద్య శిబిరము నిర్వహిం చారు. ఈ శిబిరంలో అఫ్తాలమిక్ వైద్య నిపుణులు ఎస్.సత్యనారాయణ 21 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. వీరిలో 3 మందికి కాటరాక్ట్ శస్త్రచికిత్స అవరసరమని, 15 మందికి కళ్లద్దాలు అవసరాన్ని గుర్తించారు. కాటరాక్ట్ ఆఫరేషన్లకు సంబంధించిన ఏరియా ఆసుపత్రిలో వారికి త్వరలో శస్త్రచికిత్సలు చేయిస్తామని, కళ్లద్దాలు ఉచితంగా అందజేయ నున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ పిఎన్ఎస్డి.రత్నకుమారి, ఎమ్‌పిహెచ్ఇఒ జె.మల్లికార్జునుడు, హెల్త్ ఎడ్యుకేటెడ్ బి.రామారావు, హెల్త్ సూపర్‌వైజర్ పి.సురేష్, హెచ్‌వి టి.మేరీమణి, ఎఎన్ఎమ్‌లు, ఆశాలు పాల్గొన్నారు.

పంచాయతీలకు నిధుల ఊరట

- రూ.31.47 కోట్ల ఆర్థిక సంఘం నిధుల విడుదల
- గ్రామాల్లో అత్యవసర పనులు చేపట్టేందుకు అవకాశం

ప్రజాశక్తి - రాజోలు

నిధులు లేక కునారిల్లుతున్న గ్రామ పంచాయతీలకు ఊరట లభించింది. ఎట్టకేలకు ఆర్థిక సంఘం నిధులు జమయ్యాయి నిధుల కోసం గత వైసిపి ప్రభుత్వంలో సర్పంచ్‌లు రోడ్డెక్కి ఆందోళనలు చేసినా పట్టించుకోని పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం చొరవతో కేంద్రం 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి నిధులు విడుదలయ్యాయి. నిధుల లేమితో ఇబ్బందులు పడుతున్న పంచాయతీలకు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు ఒకదాని వెంట మరొకటిగా విడుదల చేస్తుండడంతో పల్లె పాలనకు సమస్యలు తీరనున్నాయి. ఈ నిధుల్లో 60 శాతం టైడ్ నిధులుగా, 40 శాతం నిధులు అన్ టైడ్ కింద విడుదల చేశారు. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని 385 పంచాయతీ లకు మొదటి విడత 15వ ఆర్థిక సంఘం నిధులు రూ. 31.47 కోట్లు విడుదల చేసింది.

పూర్వ వైభవం దిశగా

జిల్లాలో సుమారు 60 శాతం పంచాయతీలు ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నాయి. గత వైసిపి పాలనలో కేంద్రం ఇచ్చే ఆర్థిక సంఘం నిధులు విద్యుత్తు బిల్లుల రూపంలో దారి మళ్లించి పంచాయతీ ఖాతాలను ఖాళీ చేశారు. కొందరు సర్పంచులు వడ్డీలకు అప్పులు తెచ్చి చేసిన పనులకు బిల్లులు రాక లబోదిబోమన్నారు. నాడు గ్రామ సర్పంచులు గల్లీ నుంచి ఢిల్లీ వరకు పోరాటం చేసినా ఫలితం లేదు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కొలువు దీరిన తర్వాత సిఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పంచాయతీ వ్యవస్థపై ప్రత్యేక దృష్టి సారించారు. ఇప్పటికే పాతబకాయిలను రెండు విడ తలుగా విడుదల చేయగా, ఇప్పుడు ఆర్థిక సంఘం నిధులు జమ కానున్నాయి.

అన్‌టైడ్‌లో పది శాతం విద్యుత్తు ఛార్జీలకు

ఆర్థిక సంఘం నిధులు విడుదలైన ప్రతిసారీ పంచాయతీల విద్యుత్ బకాయిలకు కొంత మొత్తాన్ని చెల్లించాలని ప్రభుత్వం ఆదేశిస్తోంది. అదే తరహాలో ఇప్పుడూ అన్‌టైడ్ గ్రాంటుగా విడుదల చేసిన దానిలో పది శాతం విద్యుత్ బకాయిలకు కచ్చితంగా చెల్లించాలని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది. మరో పది శాతం నిధులను ఎల్ఇడి వీధి లైట్ల నిర్వహణకు, మిగిలిన 20 శాతం నిధులను కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ సిబ్బంది వేతనాలు, కంప్యూటర్ల కొనుగోలు వంటివి చేయాలి. అలాగే పంచాయతీ తీర్మానాలకు, డాక్యుమెంట్లకు అవసరమైన పేపర్లు, ఇతర సామగ్రి కొనుగోలు చేసుకోవచ్చు. పాఠశాల భవనాల మరమ్మతులు, తాగునీటి వసతి, ఆట స్థలాల అభివద్ధి వంటి పనులకు ఖర్చు చేసుకోవచ్చు.ఆర్థిక సంఘం నిధులు రెండు గ్రాంట్ల రూపంలో పంచాయతీ ఖాతాకు జమ అవుతాయి. మొత్తం ఆర్థిక సంఘం నిధుల్లో 40శాతం బేసిక్ గ్రాంటు, 60 శాతం టైడ్ నిధులుగా విభజించి జమచేస్తారు. టైడ్ నిధులలో 50శాతం పారిశుధ్యం, 50 శాతం తాగునీటి వసతులు కల్పించేందుకు వినియోగించాలి. పారిశుధ్య పనుల్లో భాగంగా చిన్నచిన్న డ్రెయిన్లను నిర్మించుకునే అవకాశం ఉంది. బేసిక్ నిధుల నుంచి వీధి దీపాల నిర్వహణ, విద్యుత్తు బిల్లుల చెల్లింపులు, సిసి రహదారులు నిర్మాణం చేపట్టవచ్చు.



తాటిపాక గ్రామ పంచాయతీ

ఆందోళనలు ఫలించాయి



గత వైసిపి ప్రభుత్వం పంచాయతీ నిధులు దారి మళ్లించి నిర్వీర్యం చేయడంపై హక్కులు సాధన కోసం కలెక్టరేట్ వద్ద ధర్నాలు, ఆందో ళనలు చేపట్టాం. నిధులు లేక ఎలాంటి పంచాయతీలను అభివృద్ధి చేయలేకపోయాం. కూటమి ప్రభుత్వం ఆర్థిక సంఘం నిధులు మంజూరు చేసి పంచాయతీలకు జవ సత్వాలు తీసుకువచ్చింది. ప్రణాళికలు సిద్ధం చేసి పంచాయతీ లఅభివృద్ధికి కృషి చేస్తాం.

-కోటిపల్లి రత్నమాల, సర్పంచ్ తాటిపాక, రాజోలు మండలం

జిల్లా వ్యాప్తంగా వివరాలు

మొత్తం పంచాయతీలు : 385

విడుదల అయిన మొత్తం నిధులు : రూ. 31,47,29,493

బేసిక్ నిధులు : రూ.12,58,91,802

టైడ్ నిధులు : రూ.18,88,37,691

పంచాయతీలు బలోపేతమవుతాయి



జిల్లాలోని 385 పంచాయతీలకు మొదటి విడత 15వ ఆర్థిక సంఘం నిధులు రూ. 31.47 కోట్లు విడుదలయ్యాయి. ఈ నిధులతో పంచాయతీలు ఆర్థికంగా బలోపేతం అవుతాయి. తాగునీరు, శానిటేషన్, వీధిదీపాల నిర్వహణ తదితర పనులు చేపడతాం. ఆర్థిక సంఘం నిధులను నేరుగా పంచాయతీ బ్యాంకు ఖాతాలకే జమ చేస్తారు. ఈ వారంలో పంచాయతీలకు జమ అవుతాయి. వీటిని ప్రభుత్వం నిర్దేశించిన మార్గ దర్శకాలకు అనుగుణంగా సర్పంచులు ఖర్చు చేసుకునే వెసులుబాటు ఉంటుంది.

-శాంత లక్ష్మి, డిపిఒ



చిర్రయానంలో పీతల సాగు చేస్తున్న రైతుల నుంచి వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్

పచ్చ పీతల హేచరీ ఏర్పాటుకు స్థల పరిశీలన

ప్రజాశక్తి - కాట్రేనికోన

డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా కాట్రేనికోన మండలం చిర్రయానంలో ప్రభుత్వం నిర్మించనున్న పచ్చ పీతల(గ్రీన్‌క్రాబ్) హేచరీకి అవసరమైన స్థలాన్ని గురువారం కలెక్టరు ఆర్.మహేష్ కుమార్ పరిశీలించారు. చిర్రయానంలో ఎన్ఎస్ఇవి నిధులు రూ.2.75 కోట్లతో పీతల హేచరీ నిర్మించనున్నారు. దీనికి సంబంధించిన స్థలం సర్వే నెంబరు 1లో ఐదు ఎకరాల స్థలాన్ని కలెక్టర్ పరిశీలించారు. అనంతరం పీతలు సాగు చేస్తున్న చెరువులను పరిశీలించిన కలెక్టరు పీతల సాగు చేయు పద్ధతులు, మార్కెటింగ్, ఉపాధి అవకాశాలపై పీతల సాగు చేస్తున్న రైతులను అడిగి తెలుసుకున్నారు.పీతల సాగు చేస్తున్న పల్లం, నీళ్ళరేవు, చిర్రయానం రైతులు చెన్నెయ్ లోని రాజీవ్ గాంధీ సెంటర్ ఫర్ ఆక్వా కల్చరు నుంచి పీతల పీడును తెచ్చేవారమని అన్నారు. హేచరీలో సీడు ధర రూ.12 ట్రాన్స్ పోర్టు, ఫ్యాకింగ్ ఖర్చులు రూ.3 అదనంగాను ఉండేదని, ఎక్కువ దూరం ట్రాన్స్ పోర్టు చేయడం వలన 50 శాతం పిల్లలు బతికేవని అన్నారు. పీత సీడు చెరువుకు వచ్చేసరికి రూ.50 పడేదని అన్నారు. హేచరీ అందుబాటులోనికి వస్తే రూ.12కే పీత సీడు దొరుకుతుందని, సమయం ఆదాతో పాటు, పిల్లలు బతుకుదల శాతం అధికంగా ఉంటుందని పీతల సాగు రైతులు కలెక్టర్‌కు వివరించారు. ఈ కార్యక్రమంలో తహాశీల్దారు పి.సునీల్ కుమార్, ఎపిఒ గోపాలకృష్ణ, రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ నాగిడి నాగేశ్వరరావు, దండుప్రోలు సత్యం, పిఎస్ఎన్.రాజు, అంగాని నరసింహమూర్తి, మల్లాడి అన్నవరం తదితరులు ఉన్నారు.

మహిళా సంరక్షణపై అవగాహనా సదస్సు

ప్రజాశక్తి - రామచంద్రపురం

మహిళా సంరక్షణపై విద్యార్థులు అనుసరించవలసిన విధానాలను ద్రాక్షారామ ఎస్ఐ లక్ష్మణ్ అవగాహన కలించారు. వేగయమ్మ పేట, కాపవరం జడ్‌పి హైస్కూల్స్‌లో మహిళా సంరక్షణపై ఏర్పాటు చేసిన అవగాహనా సదస్సులో ఆయన మాట్లాడారు. బాల్యవివాహాలు, ఈవ్‌టీజింగ్ గురించి అప్రమత్తంగా ఉండాలని విద్యార్థుల్లో అవగాహన కల్పించారు. ద్రాక్షారామ పోలీస్ స్టేషన్ సిబ్బంది మూడు టీములుగా ఏర్పడి గురువారం మండలంలోని 18 స్కూల్స్ మహిళల భద్రత కొరకు అవగాహన సదస్సులు ఏర్పాటు చేశారు . విద్యార్థులకు ఏ అపాయం ఏర్పడిన వెంటనే పోలీసులను సంప్రదించాలని ఈ సందర్భంగా సూచించారు.



సదస్సులో బాలికలతో మాట్లాడుతున్న ఎస్ఐ లక్ష్మణ్

డిసెంబర్ 14న జాతీయ లోక్ అదాలత్

ప్రజాశక్తి - అమలాపురం


రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ సూచనల మేరకు జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆదేశాలతో డిసెంబర్ 14న జాతీయ లోక్ అదాలత్ ను నిర్వహించనున్నట్లు జిల్లా అదనపు రెండవ న్యాయమూర్తి మండల్ లీగల్ సర్వీసెస్ అధారిటీ చైర్మన్ వి.నరేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కక్షిదారు లు సద్వినియోగం చేసు కొని రాజీపడదగ్గ ఆమోద యో గ్యమైన అన్ని క్రిమినల్, సివిల్ కేసులు, వాహన ప్రమాద బీమా, కుటుంబ వివాదాలు, చిట్ ఫండ్స్ వివాదాలు, బ్యాంకు లావాదేవీల కేసులు, వివిధ రకాల బకాయిలు, మున్సిపల్ ఆస్తి, నీటి పన్నుల కేసులను ఈ లోక్ అదాలత్ నందు పరిష్కరిస్తారన్నారు. కార్యక్రమంలో పోలీసులు న్యాయవాదులు కక్షి దారులు పెద్ద ఎత్తున పాల్గొని ఎక్కువ కేసులను పరిష్కరించడం ద్వారా కార్యక్రమాన్ని విజయ వంతం చేయాలన్నారు

పశుగణనతో పాడి రైతులకు మేలు

ప్రజాశక్తి - ఆలమూరు

సమగ్ర పశుగణనతో పశువుల ఆరోగ్యం, ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంపొందించడం ద్వారా పాడి రైతులకు ఆర్థికంగా మేలు చేకూరుతుందని జిల్లా వెటర్నరీ పశుసంవర్ధక శాఖ అధికారిడాక్టర్ కె.వెంకట్రావు అన్నారు. గుమ్మిలేరు, మోదుకూరులలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పశుగణన కార్యక్రమాన్ని ఆయన గురువారం పరిశీలించారు. ముందుగా సర్పంచ్ గుణ్ణం రాంబాబు, గ్రామ టిడిపి నాయకులు ఈదల వీర్రాజు చౌదరి ఆయనను గ్రామంలోకి ఆహ్వానిస్తూ ఇండోర్ ప్లాంట్ అందించి సత్కరించారు. ఈ సందర్భంగా జిల్లా అధికారి మాట్లాడుతూ పశుగణన మంచి కార్యక్రమని దీనితో పశువులు, గొర్రెలు, మేకలు, గుర్రాలు, పందులు తదితర 16 రకాల పెంపుడు జంతువుల సమాచారాన్ని సేకరిస్తారన్నారు. ఈ గణనలో భాగంగా పశువుల సమగ్ర సమాచారంతో పాటూ రైతులకు చెందిన వ్యవసాయ పరికరాల వివరాలను సేకరించడం మంచి పరిణామమన్నారు. ఈ సర్వేతో పాడి పరిశ్రమపై ఆధారపడి జీవించే వారి సంక్షేమం, అభివృద్ధికి తోడ్పాటు అందించేందుకు వీలుగా ఉంటుందన్నారు. అనంతరం మోదుకూరులో సీతారామ సెమిన్ బ్యాంక్‌ను పరిశీలించారు. అలాగే పశుసంవర్ధక శాఖ ఎడి ఎల్.అనిత మాట్లాడుతూ మండలంలో 540 బ్రూసెల్లోసిస్ వ్యాధి నిరోధిక టీకాలు అందుబాటులో ఉన్నాయన్నారు. 4 నెలల నుంచి 8 నెలల వయసున్న దూడలకు టీకాలు వేయడం ద్వారా జీవితకాలం ఆ వ్యాధి రాకుండా కాపాడుకోవచ్చన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

కార్టూ'నిజం'



ఉద్యాన సాగులో యాజమాన్య పద్ధతులపై శిక్షణ

ప్రజాశక్తి - అమలాపురం రూరల్

సమనస రైతు సేవా కేంద్రం నందు రాష్ట్రీయ కిసాన్ వికాస్ యోజన పథకంలో భాగంగా ఉద్యాన పంటలల్లో యాజమాన్య పద్ధతులపై గురువారం అమలాపురం సబ్ డివిజన్ పరిధిలో గల 4మండలాల గ్రామ వ్యవసాయ, ఉద్యాన సహాయకులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా జిల్లా వ్యవసాయ అధికారి వి.బోసుబాబు, జిల్లా వనరుల కేంద్రం ప్రాజెక్టు డైరెక్టర్ జ్యోతిర్మయి శిక్షణ ఇవ్వడం జరిగినది. జిల్లా వ్యవసాయ అధికారి మాట్లాడుతూ ఈ నెల 23 నుంచి వర్ష సూచన ఉన్నందున రైతులను అప్రమత్తం చేయాలని, వరి కోతలను వాయిదా వేసుకోవాలని రైతులకు తెలియజేయాలని సూచించినారు. రబీ పంటలకు సంబంధించి ఇన్స్యూరెన్స్ గడువు డిసెంబర్ 31 వరకు ఉన్నందున రైతులకు తెలియజేసి దగ్గరలోని సిఎస్సి కేంద్రాలలో వారిచే ప్రీమియం (వరికి ఒక ఎకరాకు (రూ.680) చెల్లించే విధముగా చర్యలు తీసుకోవాలని తెలియజేసినారు. జిల్లా వనరుల కేంద్రం ప్రాజెక్టు డైరెక్టర్ జ్యోతిర్మయి మాట్లాడుతూ గ్రామ వ్యవసాయ, ఉద్యాన సహాయకులు అన్నీ పంటలపై అవగాహన పెంచుకోవాలని, రైతులకు సూచనలు ఇచ్చే విధముగా ఉండాలని ఈ శిక్షణ కార్యక్రమము ఏర్పాటు చేశామన్నారు. అలాగే ఎరువుల వాడకంలో మట్టి స్వభావాన్ని బట్టి పోషకాల లభ్యతను అనుసరించి వాడాలని, నానో యూరియా, నానో డిఎపి యొక్క ఉపయోగాలు తెలియజేస్తూ రైతులు అవి వాడే విధముగా చేయాలని తెలిపారు. ఉద్యాన అధికారిని ఎం.శైలజ మాట్లాడుతూ ఉద్యాన పంట లలో అనుసరించే యాజమాన్య పద్ధతులు, చీడ పీడలపై తీసుకోవలసిన జాగ్రత్తలు తెలియజేశారు. అలాగే ఉద్యాన శాఖలో గల వివిధ పథకాల గురించి తెలియజేస్తూ రైతులకు అవి అందె విధముగా చర్యలు తీసుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమములో అమలాపురం సబ్ డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు ఎంఎ షంషీ, మండల వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు, గ్రామ వ్యవసాయ, ఉద్యాన సహాయకులు తదితరులు పాల్గొన్నారు.



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న వ్యవసాయ అధికారులు

పారిశుధ్య కార్మికులకు సహకరించాలి : ఎంపిడిఒ

ప్రజాశక్తి - ఆలమూరు

గ్రామస్తులందరూ పారిశుధ్య కార్మికులకు తప్పకుండా సహకరించాలని ఎంపిడిఒ, ఇన్‌ఛార్జి డిఎల్‌పిఒ ఐ.రాజు అన్నారు.మండలంలోని జొన్నాడ ఎస్డబ్ల్యుసిని ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ఉన్న సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ పార్కులు సమర్థవంతంగా నడిపించాలని కార్యదర్శులను ఆదేశించారు. అలాగే తడి, పొడి చెత్తలను వేరువేరుగా సేకరణ దారులకు అందజేయాలని సూచించారు. అలాగే ఎస్‌డబ్ల్యుసిలో వర్మి కంపోస్ట్ తయారీలో సూక్ష్మ దష్టితో పనిచేయాలన్నారు. తయారైన వర్మి కంపోస్టును జాగ్రత్తగా సేకరించి కావలసిన వారికి విక్రయించాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి సుభాష్, సిబ్బంది పాల్గొన్నారు.




ఎస్‌డబ్ల్యుసిని పరిశీలిస్తున్న ఎంపిడిఒ రాజు

గాయపడిన యువకుడికి రూ.85 వేల సాయం

ప్రజాశక్తి - కొత్తపేట

మండలంలో రాముడు నూతి మెరక గ్రామానికి చెందిన యువకుడి దంగేటి శేఖర్‌కు రూ.85 వేలు శ్రీరామ్ ఫైనాన్స్ ఓల్డ్ సిబ్బంది బుధవారం సాయం అందజేశారు. రావులపాలెం బ్రిడ్జి మీద శేఖర్‌కు ప్రమాదానికి గురికావడంతో అతని తలకు బలమైన గాయం అయ్యింది. అతనికి రాజమహేంద్రవరం బొల్లినేని హాస్పిటల్ నందు చికిత్స అందిస్తున్నారు. కానీ సుమారుగా ఒక సంవత్సరం వరకు మెరుగైన చికిత్స అందించాలని వైద్యులు తెలియజేశారు. వారి ఆర్థిక పరిస్థితిని బట్టి అతని కుటుంబ సభ్యులు ఇంటి వద్దనే అతనికి వైద్య సేవలు చేస్తూ ప్రతి 15 రోజులుకు ఒకసారి వైద్య చికిత్సకు రాజమహేంద్రవరం తీసుకువెళుతున్నారు. అతని ఆర్థిక పరిస్థితి కూడా అంతాంత మాత్రమే ఉండటంతో వైద్య చికిత్సకు కూడా కుటుంబ సభ్యులు ఇబ్బంది పడుతున్నారని విషయం తెలుసుకుని రావులపాలెం శ్రీరామ్ ఫైనాన్స్ ఓల్డ్ సిబ్బంది గరపాటి అయ్యప్ప స్వామి, అవినాష్ చౌదరి, జి.రమేష్ (ఫైవ్‌స్టార్ మేనేజర్), ర్యాలి నాగబాబు, దుర్గా ప్రసాద్ మందపల్లి, కొమరాజులంక నాగు, జంపన రాంబాబు, ఓల్డ్ సిబ్బంది సహకారం తో వైద్య చికిత్స నిమిత్తం రూ.85 వేలు సాయం అందించారు. ఈ కార్యక్రమంలో శ్రీ రామ్ ఫైనాన్స్ ఓల్డ్ బ్యాచ్ పాల్గొన్నారు .ఈ సందర్భంగా శ్రీరామ్ సిబ్బంది మాట్లాడుతూ బాధితునికి ఎవరైనా దాతలు సహకరించాలి అంటే 9000256654 (దంగేటి శేఖర్) కు ఫోన్ పే చేయగలరని కోరారు.



సాయం అందజేస్తున్న శ్రీరామ్ ఫైనాన్స్ ఓల్డ్ సిబ్బంది

ఇసుక ర్యాంపులను పరిశీలించిన ఆర్‌డిఒ

ప్రజాశక్తి - ఆత్రేయపురం

మండలంలోని ఆత్రేయపురం, పులిదిండి, నార్కెడిమిల్లి ఇసుక ర్యాంపులను గురువారం కొత్తపేట ఆర్‌డిఒ శ్రీకర్ పరిశీలించారు. సిబ్బందికి మరియు ర్యాంపు నిర్వాహకులకు పలు సూచినలు ఇచ్చారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎటువంటి అవినీతికి తావు లేకుండా ఇసుక తవ్వకాలు పారద ర్శంగా నిర్వహించేలా ఎప్పటికప్పుడు రాంపులను పర్యవేక్షించాలని తహశీల్దార్ టి.రాజేశ్వరరావుకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ ఎస్.రాము, ఎంపిడిఒ బిఎస్ఎన్. వెంకట్ రామన్, డిప్యూటీ తహశీల్దార్ శ్రీరామ చంద్రమూర్తి, ఆర్ఐ యం.భాను, గ్రామ రెవెన్యూ అధికారులు, పంచాయతి కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, ఇసుక ర్యాంపు కాంట్రాక్ట్ సిబ్బంది పాల్గొన్నారు .



పులిదిండిలో ఇసుక ర్యాంపు వద్ద అధికారులతో మాట్లాడుతున్నఆర్‌డిఒ

త్వరలో ప్రారంభం కానున్న ఊబలంక ర్యాంప్

రావులపాలెం: మండల పరిధి ఊబలంకలో త్వరలో ప్రారంభించనున్న ఇసుక ర్యాంపును కొత్తపేట ఆర్‌డిఒ శ్రీకర్ పరిశీలించారు. గురువారం ఊబలంకలో త్వరలో ప్రారంభం కానున్న ర్యాంపును పరిశీలించి ఉచిత ఇసుక పంపిణీ కార్య క్రమంపై అధికారులకు సూచనలిచ్చారు. కార్యకమంలో తహశీల్దార్ ముక్తేశ్వరరావు, ఆర్ఐ రెవెన్యూ సర్వేయర్, పోలీసులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

కొబ్బరి అనుబంధ పరిశ్రమలకు ప్రోత్సాహం కల్పించాలి

ప్రజాశక్తి - పి.గన్నవరం

కొబ్బరి సాగు ఎక్కువగా ఉన్న కోనసీమలో కొబ్బరి అనుబంధ పరిశ్రమలు ఏర్పాటు చేయాలని పి.గన్నవరం ఎంఎల్ఎ గిడ్డి సత్య నారాయణ గురువారం అసెంబ్లీ సమావేశంలో కోరారు. సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ కోనసీమ ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీ మేరకు కేరళ తరహాలో కొబ్బరి బోర్డు ఏర్పాటు చేయాలని, మద్దతు ధర లేక రైతులు ఇబ్బందులు పడుతు న్నారని ఎంఎల్ఎ గిడ్డి అన్నారు. అలాగే కొబ్బరి అనుబంధ పరిశ్రమలు ఏర్పాటు చేస్తే ఎందరికో ఉపాధి అవకాశాలు కల్పించవచ్చని కోరారు. కూటమి ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టాలని ఆయన అన్నారు.



మాట్లాడుతున్న ఎంఎల్ఎ గిడ్డి

బాలికల వసతిగృహం సందర్శన

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

గొల్లవిల్లి సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహాన్ని గురువారం హాస్టల్ ప్రత్యేక అధికారులుగా నియమించిన జిల్లా వ్యవసాయ ట్రేడ్ అధికారి కెఎస్ వి.విశాలాక్షి, ఉపాధి హామీ చట్టం ఇసి ఎం.వీరబాబు సందర్శిం చారు. వసతి గృహంలో కావ లసిన మౌలిక సదుపాయాలు గురించి వార్డెన్ వై.రోజాపుష్పను వారు అడిగి తెలుసుకున్నారు. వసతి గృహంలో విద్యార్థినులకు ఆర్ఒ ప్లాంటు అదనపు బాత్ రూమ్‌లు, వంట గదిలో ఇంకా కావలసిన వంట సామగ్రి, ప్రాంగణంలో విద్యుత్ దీపాలు భవనానికి రంగులు తదితర అవసరాలను ఈ సందర్భంగా ప్రత్యేక అధికారులకు వార్డెన్ రోజాపుష్ప వివరించారు. బాలికల వసతి గృహంలో కావలసిన అవసరాల వివరాల నివేదికను కలెక్టర్ కు అందజేస్తామని అధికారులు తెలిపారు. ప్రతి నెలా కలెక్టర్ తమకు ప్రత్యేక అధికారులుగా బాధ్యతలు అప్పగించిన బాలికల వసతి గృహాన్ని సందర్శించి వసతి గృహం పనితీరును మెరుగుపరుస్తామని వారు తెలిపారు.



వార్డెన్ నుంచి వివరాలు తెలుసుకుంటున్న ప్రత్యేక అధికారులు



ఎంపికైన విద్యార్థులతో హెచ్‌ఎం రాణి

రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్ -14 సాఫ్ట్ బాల్ పోటీలకు గొల్లవిల్లి జడ్‌పి ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులు పండు దివ్య లేఖన, మల్లిపూడి అయ్యప్పలను గురువారం ఆ పాఠశాల్లో ఎస్ఎంసి ఛైర్మన్ వాలా సత్యనారాయణ, హెచ్‌ఎం ఎల్.రాణి, పీడీలు గొలకోటి ఫణీంద్ర కుమార్, డి.సరస్వతి, పిఇటి విజయ భాస్కర్ ఉపాధ్యాయులు అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీలకు దివ్య లేఖన, అయ్యప్పలు ఎంపిక కావడం పట్ల సర్పంచ్ జొన్నాడ శ్రీదుర్గ, ఎంపిటిసి సభ్యురాలు దోనిపాటి బాలమ్మ, గ్రామ పెద్దలు ఆనందం వ్యక్తం చేశారు.



సర్పంచ్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఓం ప్రకాష్

సమస్యల పరిష్కారానికి 104 ఉద్యోగుల డిమాండ్

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

104 ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని 104 యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కుసుమ ఓంప్రకాష్ డిమాండ్ చేశారు. తమసమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడంలేదని ఆయన ఆరోపించారు. ఈ మేరకు ఓంప్రకాష్ నిరసన వ్యక్తం చేశారు. అనంతరం గురువారం మునిపల్లి సర్పంచ్ యర్రంశెట్టి రామచంద్రరావుకు వినతిపత్రం అందజేశారు.104 వ్యవస్థను నేరుగా పిహెచ్‌సిల ద్వారా ప్రభుత్వమే నిర్వహించాలని, జిఒ నెం.7 వర్తింపచేయాలని, ప్రతి నెలా సక్రమంగా వేతనాలు చెల్లించాలని , ఇంత వరకు యాజమాన్యం నుంచి రావలసిన పిఎఫ్, ఇఎస్ఐ, ఇంక్రిమెంట్లు అందరికీ అందజేయాలని ఓంప్రకాష్ డిమాండ్ చేశారు.

ఘనంగా శెట్టిబలిజ కార్తీక వన సమారాధన

ప్రజాశక్తి - రామచంద్రపురం

పట్టణంలో గురువారం నిర్వహించిన శెట్టిబలిజ కార్తీక వన సమారాధన ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా టిడిపి పొలిట్ బ్యూరో సభ్యుడు రెడ్డి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు. సుమారు 3000 మంది కార్యక్రమానికి హాజరు అయ్యారు. వినోద కార్యక్రమాలు రంగులరాట్నం అలరించాయి. కార్యక్రమానికి మంత్రి వాసంశెట్టి సుభాష్ తండ్రి సత్యం, సత్య స్కాన్ అధినేత డాక్టర్ కాద వెంకటరమణ, బిసి సంఘం నాయకులు, కట్ట నాగేశ్వరరావు, యనమదల శ్రీనివాసు, దొంగల శ్రీధర్, కే. గంగవరం రామచంద్రపురం, కాజులూరు మండలాల నుంచి శెట్టిబలిజలు మహిళలు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

నేరాలు ఘోరాలు

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

విద్యుత్ షాక్‌తో ఒక వ్యక్తి మరణించిన సంఘటన గురువారం మండలంలోని కె.సావరంలో చోటు చేసుకుంది. మాదాసు నాగేంద్ర (35), నెక్కంటి పవన్ పశ్చిమ గోదావరి జిల్లా తణుకులో ప్రైవేట్ ఆసుపత్రిలో ఉద్యోగం చేస్తున్నారు. ఇంటి వద్ద పెయింటింగ్ పనులు ఉండడంతో నాగేంద్ర పనిచేస్తున్న హాస్పటల్ నుండి నిచ్చెన తీసుకొనివచ్చి, తిరిగి ఇచ్చేందుకు తీసుకు వెళుతున్న క్రమంలో నిచ్చెన విద్యుత్ వైర్లకు తాకి, షాక్ తో సంఘటనా స్థలంలోనే మతి చెందాడు. నాగేంద్రకు భార్య గాయత్రి, ఒక సంవత్సరం పాప ఉన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సారా బట్టీపై దాడి

ప్రజాశక్తి - పెద్దాపురం

ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని మురారి గ్రామంలో గురువారం నిర్వహించిన దాడుల్లో సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 600 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ సిఐ కెవివిడి.అర్జునరావు తెలిపారు. అలాగే కాండ్రావులపల్లిలో నిర్వహించిన దాడుల్లో అక్రమంగా నిలవచేసిన 6 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని వ్యక్తిపై కేసు నమోదు చేశామన్నారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐలు ప్రసాదరావు, చిట్టిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల్లో ఏడుగురికి గాయాలు

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలంలోని గురువారం వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఏడుగురు గాయపడ్డారు. తాళ్లరేవు గొల్లలపేట నుంచి చొల్లంగిపేటకు నిశ్చితార్థ వేడుకకు సంబంధించింది రెండు ఆటోల్లో పలువురు బయలు దేరారు. ఆటో జి.వేమవరం జామకాయల తూము సెంటర్‌కు చేరుకునే సరిగా కాకినాడవైపు నుంచి వస్తున్న బైకును ఢీకొన్ని బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న ఏసూరి గనికమ్మ, శవల చెల్లయమ్మ, తట్టుగళ్ల లోవ, మందాల దుర్గమ్మ, బాలుడు సాయి గణేష్ గాయపడ్డాడు. ద్విచక్ర వాహనం నడుపుతున్న సునీల్‌కు స్వల్ప గాయమైంది. అలాగే మండలంలోని జార్జిపేట పోలేకూరు వై.జంక్షన్ వద్ద జరిగిన ప్రమాదంలో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. అమలాపురం మండలం జనిపల్లికి చెందిన కుడిపూడి మధనేశ్వరరావు బైకుపై కాకినాడ వైపు వెళ్తున్నాడు. వై.జంక్షన్ వద్దకు వచ్చేసరికి బారికేడ్‌ను ఢీకొని కింద పడిపోయాడు. అదే సమయంలో అమలాపురం నుంచి వస్తున్న ఆర్‌టిసి బస్సు అతని రెండు కాళ్లపై నుంచి వెళ్లిపోవడంతో తీవ్రంగా గాయడ్డాడు. అతన్ని కాకినాడ జిజిహెచ్‌కు తరలించారు. ఎస్ఐ సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బెల్ట్ షాపులపై ఎక్సైజ్ అధికారుల దాడులు

ప్రజాశక్తి - గండేపల్లి

రంగంపేట మండలం సింగంపల్లి, అనపర్తి మండలం పులగుర్తలో నిర్వహిస్తున్న మద్యం బెల్ట్‌షాపులపై ఎక్సైజ్ శాఖ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 124 మద్యం బాటిల్స్‌ను స్వాధీనం చేసుకుని, ఇద్దరు విక్రయదారులను అరెస్టు చేసినట్లు రంగంపేట ఎక్సైజ్ సిఐ తెలిపారు. ఈ దాడుల్లో మంగళగిరి ఎస్‌టిఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ఇద్దరికి జైలు

ప్రజాశక్తి - జగ్గంపేట

జగ్గంపేట సర్కిల్ పరిధిలో గురువారం నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో ఇద్దరికి రెండు రోజులపాటు జైలు శిక్ష ఖరారు అయిందని సిఐ వైఆర్‌కె.శ్రీనివాస్ తెలిపారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో మరో 11 మందికి రూ.10 వేలు చొప్పున జరిమానా విధించినట్లు తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగిన, తాగి వాహనాలు నడిపిన కఠిన చర్యలు తప్పవనీ ఆయన హెచ్చరించారు.

23న మోటార్ సైకిళ్ల వేలం

ప్రజాశక్తి - పి.గన్నవరం

పి.గన్నవరం పోలీస్ స్టేషన్ వద్ద సీజ్ చేయబడిన ఆరు మోటారు సైకిళ్లకు ఈనెల 23వ తేదీ శనివారం వేలం నిర్వహిస్తామని ఎస్ఐ శివకష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు 23న పి.గన్నవరం తహశీల్దార్ శ్రీ పల్లవి ఆధ్వర్యంలో పోలీస్ స్టేషన్ వద్ద ఈ వేలం ప్రక్రియ నిర్వహిస్తామని ఎస్ఐ వివరించారు. ఆసక్తి గలవారు ఈ అవకాశం వినియోగించుకోవాలని సూచించారు. ఈ ఆరు వాహనాలను స్క్రాప్ వాహనాలుగా పరిగణించినట్లు ఎస్ఐ తెలిపారు.

ఐదు ఇసుక ట్రాక్టర్ల సీజ్

ప్రజాశక్తి - కొత్తపేట

మందపల్లి ఇసుక ర్యాంపు నుంచి తరలిస్తున్న ట్రాక్టర్లను గురువారం స్థానిక పాత బస్టాండ్ సెంటర్లో ఎస్ఐ జి.సురేంద్ర తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో ఐదు ట్రాక్టర్లకు సరైన పత్రాలు లేవని గుర్తించి వాటిని సీజ్ చేసి తహశీల్దార్ డి.రాంబాబుకు నివేదించామనిఎస్ఐ తెలిపారు. దీనిపై తహశీల్దార్ వివరణ కోరగా సరైన పత్రాలు లేని ట్రాక్టర్లతో ఇసుక రవాణా చేస్తే సీజ్ చేసి చట్టపరంగా తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

గుండెపోటుతో పిఆర్‌ఒ ధనరాజు మృతి

ప్రజాశక్తి - అంబాజీపేట

మండలంలో పుల్లేటికుర్రుకు చెందిన బీర ధనరాజు(27) బుధవారం గుండెపోటుతో మృతిచెందారు. వివరాలు ఇవి.. ధనరాజు ఆర్‌డిఏ కమిషనర్ వద్ద పిఆర్‌ఒగా పనిచేస్తున్నారు. ధనరాజుకు అమరావతిలో బుధవారం మధ్యాహ్నం హఠాత్తుగా గుండెపోటు రావడంతో ఆయన మరణించారు. ఈ ఘటనతో ఆయన స్వగ్రామమైన పుల్లేటికుర్రులో తీవ్ర విషాదం నెలకొంది. విషయం తెలిసిన వెంటనే పుల్లేటికుర్రు సర్పంచ్ జల్లి బాలరాజు మృతుని తండ్రితో పాటు గ్రామస్తులు పలువురు అమరావతి బయలుదేరి వెళ్లారు. గురువారం రాత్రి ధనరాజు మృతదేహాన్ని పుల్లేటికుర్రు తీసుకువచ్చారు. మృతుడు ధనరాజుకు ఇటీవలే వివాహమైంది. ధనరాజు అంత్యక్రియలు గురువారం రాత్రి నిర్వహించారు. ఆయన మృతికి పలువురు సంతాపం తెలిపారు.

నిరుపయోగంగా ఆర్‌ఒ ప్లాంట్లు

- ప్రజలకు అందని తాగునీరు
- పట్టించుకోని అధికారులు



అంగరలో పంచాయతీ వద్ద పనిచేయని ఆర్‌ఒ ప్లాంట్



అంగరలో వాటర్ ట్యాంక్ వద్ద పనిచేయని ఆర్‌ఒ ప్లాంట్ (ఇన్‌సెట్)లో 2014లో సిఎం చంద్రబాబు ప్రారంభించిన ఆర్‌ఒ ప్లాంట్ శిలాఫలకం(ఫైల్)

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

ప్రజలకు రక్షిత తాగునీరు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం దాతల సహకారంతో ఏర్పాటు చేసిన ఆర్‌ఒ ప్లాంట్లు పనిచేయకుండా పోయాయి. చంద్రబాబు సిఎంగా బాధ్యతలు చేపట్టి గత 2014 అక్టోబర్ 4న తొలిసారిగా అంగర గ్రామం వచ్చి గ్రామాభివృద్ధి కోసం వరాల జల్లు కురిపించారు. అదే రోజు గ్రామంలో ఎన్‌టిఆర్ సుజల పథకాన్ని ప్రారంభించారు. అయితే కొంతకాలం ప్రజలకు తాగునీరు అందడంతో సంతోషం వెళ్ళబుచ్చారు. అనంతరం దాన్ని పట్టించుకునే వారే కరువవ్వడంతో అంచెలంచెలుగా రిపేర్లతో అది మూలన పడింది. దీంతో ఆ ప్రాంత ప్రజలకు తాగునీరు అందకుండా పోయింది. అలాగే గ్రామ పంచాయతీని ఆనుకుని బలుసు రుద్రయ్య మెమోరియల్ ట్రస్ట్ డాక్టర్ బలుసు సుబ్బారావు ఆధ్వర్యంలో ఆర్‌ఒ ప్లాంట్ నిర్మాణం కోసం దాత భవన నిర్మాణం చేపట్టారు. అందులో గత 2014 ఆగస్టు 8న ఓఎన్‌జిసి వారి ఆర్థిక సాయం తో ఏర్పాటు చేసిన ఆర్‌ఒ ప్లాంట్ గ్రూప్ జనరల్ మేనేజర్, అసిస్టెంట్ మేనేజర్ పాసల కృష్ణారావు, ఎంఎల్ఎ వేగుళ్ల జోగేశ్వరరావు ప్రారంభించారు. దీంతో ఆ ప్రాంత వాసులకు తాగునీరు ఇబ్బంది లేకుండా పోయింది .అది కూడా నిర్వహణ సక్రంగా లేకపోవడంతో కాలక్రమేణా పని చేయకుండా పోవడంతో ప్రజలకు నిరాశేమిగిలింది.

మరమ్మతులు చేయిస్తాం

ఈ విషయాన్ని గ్రామ సర్పంచ్ వాసా కోటేశ్వరరావు దృష్టికి తీసుకువెళ్లగా రెండు ఆర్‌ఒ ప్లాంట్లకు గాను ఒక దానిలో సబ్ మెర్సిబుల్ పంపు, మరొక దానిలో మెమోరండ్ ఫిల్టర్ పాడవ్వడం కారణంగా పంచాయతీ లో నిధులు కొరత వల్ల వాటిని రిపేర్ చేయించలేకపోయినట్లు తెలిపారు. ఇప్పుడున్న 15వ ఆర్థిక సంఘం నిధులతో మరమ్మత్తులు చేయించనున్నట్లు తెలిపారు. త్వరితగతిన వాటికి మరమ్మతులు చేయించి ప్రజలకు అందుబాటులో తాగునీరు అందే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలని అంగర, పడమర ఖండ్రిక గ్రామ ప్రజలు కోరుతున్నారు.



చెల్లి అశోక్‌ను సత్కరిస్తున్న పలువురు నాయకులు

మాల కార్పొరేషన్ డైరెక్టర్ అశోక్‌కు అభినందన

ప్రజాశక్తి - ముమ్మిడివరం

రాష్ట్ర మాల కార్పొరేషన్ డైరెక్టర్ గా నియమితులైన చెల్లి అశోక్ ను పలువురు ఘనంగా సత్కరించారు. నగర పంచాయతీ పరిధిలోని స్థానిక పల్లిపాలెం సెంటర్‌లోని అశోక్ స్వగృహంలో గురువారం నగర పంచాయతి కమిషనర్ రవివర్మ తో పాటు సిబ్బంది కలిసి దుశాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందించి ఘనంగా సత్కరించారు. అలాగే కాకినాడ స్మార్ట్ సిటీ సిఇఒ గెడ్డం సాల్మన్ చక్రవర్తి, టిడిపి పట్టణ ఎస్‌సి సెల్ అధ్యక్షుడు గొల్లపల్లి గోపి ఆధ్వర్యంలో సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ భవిష్యత్ లో మరిన్ని ఉన్నత పదవులు చేపట్టాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బొంతు శ్రీరాములు, కమిడీ గంగాధర్ గొనిమడతల రాజా, రాగుర్తి సత్తిబాబు, జనసేన నాయకుడు మోకా బాల ప్రసాద్, నగర పంచాయతి ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.



దాతలకు విఘ్నేశ్వరుని చిత్రపటం అందిస్తున్న ఆలయ అర్చకులు

నిత్యాన్నదాన నిధికి రూ.1,11,116 విరాళం

ప్రజాశక్తి - అయినవిల్లి

అయినవిల్లి విఘ్నేశ్వర స్వామి నిత్యాన్నదాన నిధికి దాత విరాళం అందజేశారు. గురువారం కాకినాడ రామారావుపేటకు చెందిన కొప్పిశెట్టి వెంకటరమణ కుటుంబ సభ్యులు విఘ్నేశ్వర స్వామిని దర్శించికుని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం విఘ్నేశ్వర స్వామి నిత్యాన్నదాన నిధికి రూ.1,11,116 విరాళంగా ఇచ్చినట్లు ఆలయ ఇఒ సతీష్ రాజు తెలిపారు వీరికి ఆలయ అర్చకులు వేద ఆశీర్వచనం అందజేసి, శేష వస్త్రాలతో సత్కరించి, స్వామి వారి చిత్రపటాన్ని బహూకరించారు.



చెత్త డంపింగ్ చేసిన ప్రాంతం నుంచి సైకిళ్లపై వెళుతున్న విద్యార్థులు

రహదారి చెంతనే చెత్త డంపింగ్

ప్రజాశక్తి - ముమ్మిడివరం

శానిటరీ అధికారుల నిర్లక్ష్యంతో చెత్తను రోడ్డు చెంతనే డంపింగ్ చేయడంతో వాహనదారులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నగర పంచాయతీ పరిధిలోని స్థానిక మార్కెట్ ప్రాంతంలో ఉన్న డంపింగ్ యార్డుకు చెత్తను తరలించే వాహనాలు వెళ్ళే మార్గం లేకపోవడంతో, రోడ్డు చెంతనే చెత్తను డంపింగ్ చేయడంతో ఆ రోడ్డు పై రాకపోకలు సాగించే వాహనదారులు, స్కూల్ కి వెళ్లే విద్యార్థులు వెళ్ళే మార్గం లేక, దుర్వాసనను భరించలేక తీవ్ర అసౌకర్యానికి గురౌతున్నారు. దీనిపై నగర పంచాయతి శానిటరీ అధికారులు దృష్టి సారించి, రోడ్డు చెంతనే డంపింగ్ చెత్తను తొలగించే విధంగా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

వాసాలరేవులో దంత వైద్య శిబిరం

ప్రజాశక్తి - రామచంద్రపురం

ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం సందర్భంగా కె.గంగవరం మండలంలోని మత్స్యకారుల గ్రామమైన వాసాలరేవు లో గురువారం ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో మత్స్యకారులకు దంత వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు, టూత్ పేస్టులు పంపిణీచేశారు. ద్రాక్షారామ భీమేశ్వర వైద్యశాల డాక్టర్ సి. క్రాంతి కుమార్ ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు గ్రామస్తులు పాల్గొని దంత వైద్య పరీక్షలు చేయించుకున్నారు.



దంత వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్

ధరల నియంత్రణపై అధికారులు, వర్తకులతో సమీక్ష

ప్రజాశక్తి - అమలాపురం

ధరల స్థిరీకరణ, నియంత్రణపై తీసుకోవాల్సిన చర్యలపై స్థానిక కలెక్టరేట్ నందు డీలర్లు, వర్తకులు గణాంక అధికారులతో గురువారం సాయంత్రం జెసి టి.నిషాంతి సమీక్షించారు.



సమావేశంలో మాట్లాడుతున్న జెసి టి.నిషాంతి

నియంత్రించాల్సి ఆవశ్యకత ఉంది

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిత్యాసరాల ధరలు, కూరగాయలు ధరల స్థిరీకరణ నియంత్రణకు కిరాణా డీలర్లు, కూరగాయల వర్తకులు సమన్వయం వహించి వినియోగదారులకు సరసమైన ధరలకు విక్రయించాలని ఆదేశించారు. కోనసీమ జిల్లాలో కూరగాయల ధరలు ఎక్కువగా ఉన్నాయని వాటిని నియంత్రించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని అందుకు డీలర్లు, వర్తకులు సహకరించాలని ఆమె సూచించారు. ప్రజలకు విక్రయించే సరుకులు ధరల స్థిరీకరణ విషయంలో భాగంగా సంస్థాగత రిటైల్ దుకాణాల్లో ప్రభుత్వం నిర్ణయించిన ధరకే నాణ్యమైన సరకులను వినియోగదారులకు అందించాలన్నదే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని ఆమె తెలిపారు. బహిరంగ మార్కెట్లలో నిత్యావసర సరుకుల ధరలను నియంత్రించడంలో భాగంగా అన్ని రైతు బజార్లలో వంట నూనెలు, కంది పప్పు, ఉల్లి, టమాటాలను అందుబాటులో ఉంచి విక్రయించా లన్నారు ప్రజలకు బియ్యం, కందిపప్పు, వంటనూనె చౌక ధరలకు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. బజార్లో సరుకుల్లో వ్యత్యాసంపై గణాంకాలు మార్కెటింగ్ అధికారులు, డీలర్లతో సమీక్షించారు. అన్ని నిత్యవసరాల వస్తువుల ధరలు ఎలా తగ్గించాలన్న విషయమై కూలంకషంగా చర్చించారు. రైతు బజార్లు సక్రమంగా పనిచేయక పోవ డానికి గల కారణాలను ఆమె అడిగి తెలుసుకు న్నారు. స్థానికంగా రైతు బజార్లో రైతులు తమ పండించిన పంటలను విక్రయించుకునేందుకు ముందుకురారని రైతు బజార్ స్టేట్ అధికారి వివరణ ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం 38 నిత్యవసర వస్తువుల ధరల నియంత్రణపై నిత్యం సమీక్షిస్తోందని ఆ మేరకు క్షేత్రస్థాయిలో ధరలు ఉండాలని ఆమె సూచించారు. అధిక ధరకు అమ్మకాలు జరిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. హోల్సేల్ రిటైల్ ధరలపై ప్రతి రోజూ కేంద్రానికి నివేదిక పది రోజులు పాటు ఆన్లైన్ యాప్లో సమర్పించాలన్నారు. గణాంక అధికారులను పది రోజులు నివేదిక రెగ్యులర్గా సమర్పించిన పిదప జిల్లాలో ధరల నియంత్రణ రిపోర్టింగ్ కేంద్రాన్ని కేంద్ర ప్రభుత్వమే స్థాపించి గణాంక అధికారుల సమన్వయంతో రెగ్యులర్ గా మానిటరింగ్ చేస్తుందన్నారు. పామాయిల్ రూ.130, సన్ ఫ్లవర్ రూ.145, బియ్యం, సూపర్ ఫైన్ రూ.55, మినప్పప్పు రూ.105, పెసరపప్పు రూ.110, వేరుశెనగ నూనె రూ.150 రూ.కందిపప్పు రూ.148 విని యోగదారులకు అందుబాటులో ఉంచామన్నారు. ప్రతి విని యోగదారుడు సద్వి నియోగం చేసుకో వాల న్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల అధికారి ఉదయభాస్కర్, జిల్లా మార్కెటింగ్ అధికారిణి కె.విశాలాక్షి గణాంకా అధి కారులు, డీలర్లు, కిరాణా షాప్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - కాకినాడ

మత్స్యకారుల సమస్యలను పరిష్కరించాలని ఎపి మత్స్యకారులు, మత్స్య కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. గురువారం ప్రపంచ మత్స్య కార్మిక దినోత్సవం సందర్భంగా సంఘం ఆధ్వర్యంలో నగరంలోని మత్స్య మార్కెట్లలో జెండా ఆవిష్కరణ చేశారు. సంఘం జాతీయ కార్యవర్గ సభ్యురాలు సిహెచ్.రమణి, జిల్లా నాయకులు యు.సత్యనారాయణ మాట్లాడుతూ మత్స్య కారుల ఉపాధి ప్రమాదంలో పడిందని, కాలుష్య కారక పరిశ్రమలు వల్ల మత్స్య సంపద నాశనం అవుతుందన్నారు. వరుస తుపానుల వల్ల వేట లేక, మత్స్యకారులు ఇబ్బందులు పడుతున్న ప్రభుత్వం వారిని ఆదుకోవడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. ఐదు నెలలు గడిచిన నేటికి మత్స్యకారుల వేట నిషేధ భృతిని అందజేయ లేదన్నారు. మార్కెట్‌లో సౌకర్యాలు లేవని, పెద మార్కెట్ లో చేపల మార్కెట్‌కు రక్షణ లేదని, పార్కింగ్ లేక కొనుగోలుదారులు రావడం లేదని అన్నారు. తీర ప్రాంత మత్స్య కారులు అనేక ఇబ్బందులు గురవుతున్నారని, కూటమి ప్రభుత్వం మత్స్య కారులను ఆదుకునే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వ్యాపారం చేసుకునే వారికి ఐస్ బాక్సు, రుణాలు, మోటార్ సైకిల్స్, బోట్‌లు ఇవ్వాలని, ఆయిల్ సబ్సిడీ పెంచాలని కోరారు. బ్లూ ఎకానమీ పాలసీతో కేంద్రం మత్స్య కారులను దెబ్బకోట్టే చర్యలు చేపట్టిందని, మత్స్యకారుల కష్టంతో దేశంలో రూ.10 వేల కోట్ల డాలర్ల విదేశీ వ్యాపారం జరుగుతుందని, అయినా వారిని ఆదుకోవడంలో కేంద్రం నిర్లక్ష్యం చేస్తుందన్నారు. ఒఎన్‌జిసి లాంటి ఆయిల్ కంపెనీల వల్ల నష్టపోతున్న మత్స్యకారులకు పరిహారం ఇవ్వాలని, దీనికి కాకినాడ పరిసర 18 గ్రామాల్లో సర్వే నిర్వహించాలని డిమాండ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎం.రాజశేఖర్, సుధా, దుర్గాదేవి, రాంబాబు, లోకాలమ్మ, స్వరూప, అప్పలనర్స, సింహాచలం, ధనలక్ష్మి పాల్గొన్నారు.

ఎంతటి పోరాటానికైనా సిద్ధం

ప్రజాశక్తి - కాకినాడ

క్లాప్ డ్రైవర్ల సమస్యల పరిష్కారం కోసం ఎంతటి పోరాటానికైనా సిద్ధంగా ఉన్నామని సిఐటియు ఆల్ ఇండియా ఉపాధ్యక్షురాలు జి.బేబీరాణి అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద క్లాప్ వాహన డ్రైవర్లు చేస్తున్న శిబిరాన్ని ఆమె గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్లాప్ డ్రైవర్లు చాలీచాలని జీతాలతో పని చేస్తున్నారని, అటువంటి వారికి 3 నెలలుగా జీతాలు చెల్లించకపోతే ఎలా జీవిస్తారని ప్రశ్నించారు. మున్సిపల్ అధికారులు వెంటనే కలగజేసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. వీరి పోరాటానికి సిఐటియు కార్మిక సంఘాల తరపున సంపూర్ణ మద్దతు తెలుపుతున్నామని, ఇదేవిధంగా క్లాప్ డ్రైవర్ సమస్యలు పరిష్కరించకుండా అధికారులు దాట వేసే వైఖరితో వ్యవహరిస్తే మున్సిపల్ కార్యాలయం ముట్టడికి సిద్ధపడతామని హెచ్చరించారు. ఉద్యమాన్ని చేపట్టి 28 రోజులు అవుతుంటే జీతాలు వేయించే విషయంలో అధికారులు ఉదాసీనంగా వ్యవహరించడం సరికాదన్నారు. తక్షణమే జీతాలు చెల్లించేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంతోష్, ఇస్మాయిల్, శివశంకర్, గంగాధర్, రాజు, వెంకటేష్, సూరిబాబు, దుర్గ బాబు, శివ, రమణ పాల్గొన్నారు.

'చెముడులంక' సర్పంచ్ స్థానాన్ని ఎస్‌సిలకు కేటాయించాలని వినతి

ప్రజాశక్తి - ఆలమూరు

మండలంలోని చెముడులంక సర్పంచ్ స్థానాన్ని ఎస్‌సలకు కేటాయించాలని ఎంపిడిఒ ఐ.రాజు, తహశీల్దార్ కె.జె.ప్రకాష్ బాబులకు బిఎస్‌పి కొత్తపేట నియోజకవర్గ అధ్యక్షులు గుర్రపు కొత్తియ్య గురువారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కొత్తియ్య మాట్లాడుతూ చెముడులంక పంచాయతీ చొప్పెల్ల నుంచి ప్రత్యేక పంచాయతీగా మేనెల 10వ తేదీ 1995 సంవత్సరంలో ఏర్పడిందన్నారు. అప్పటినుంచి ఇప్పటివరకు 30 ఏళ్లగా ఇతర సామాజిక వర్గాల వారు సర్పంచులు, ఎంపిటిసి సభ్యులుగాను చేశారన్నారు. మా గ్రామ మొత్తానికి ఓటర్లు 3800 పైబడి ఉన్నారు. ఇందులో ఎస్‌సిల ఓటర్లు 400 ఓట్లు ఉన్నాయన్నారు. గ్రామానికి మొత్తం 12 వార్డులు గాను ఎస్సీలకు ఒక వార్డు రిజర్వేషన్ ఉన్నాయన్నారు. రాజకీయ సమానత్వం వల్లే అన్ని వర్గాలు అభివృద్ధి చెందుతాయన్నారు. దీనికి సంబంధించి అధికారులు వెంటనే స్పందించి మాకు ఈ వచ్చే స్థానిక ఎన్నికల్లో సర్పంచ్, ఎంపిటిసి ఎస్‌సి రిజర్వేషన్ కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బద్ద రాజు, గుర్రపు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సృజనాత్మకత కోసం 'స్కూల్ ఇన్నోవేషన్ మారథాన్'

ప్రజాశక్తి - అమలాపురం

విద్యార్థుల సృజనాత్మకతను ప్రోత్సహించడానికి స్కూల్ ఇన్నోవేషన్ మారథాన్ కార్యక్రమం రూపకల్పన చేయబడిందని జిల్లా విద్యా శాఖ అధికారి షేక్ సలీం భాష గురువారం ఒక ప్రకట నలో తెలిపారు. జిల్లాలో స్కూల్ ఇన్నోవేషన్ మారతాన్ కార్యక్రమం ప్రారంభమైందన్నారు. ఈ కార్యక్రమం 6వ తరగతి నుంచి 12వ తరగతి విద్యార్థులకు వాస్తవ ప్రపంచ సమస్యలను పరిగణనలోకి తీసుకుని వినూత్న పరిష్కారాలను రూపొందించడానికి అభివద్ధి చేయ డానికి ఒక అద్భుతమైన వేదికను అందిస్తోందని డిఇఒ తెలిపారు ప్రతి పాఠ శాల్లో కనీసం 30 మంది విద్యార్థులతో 2 లేదా 3 మంది సభ్యులు ఉండే బృందాలను ఏర్పాటు చేయాలన్నారు ఇప్పటికే స్కూల్ స్థాయిలో బృందాలు ఏర్పాటు చేయడం పూర్తిగా వచ్చింద న్నారు. విద్యార్థులు తమ యూ జర్ ఐడీ మరియు పాస్‌వర్డ్‌ను ఉపయోగించి స్కూల్ ఇన్నోవేషన్ మారథాన్ పోర్టల్‌లో లాగిన్ అవ్వా లన్నారు. ప్రతి బృందం ప్రీ సర్వే పూర్తి చేయాలని,అందుబాటులో ఉన్న కోర్సును పూర్తిగా పూర్తి చేయడం కీలక మన్నారు. థీమ్ ఆధారంగా ప్రాజెక్టు రూపకల్పన చేయాలని కోర్స్ పూర్తి చేసిన అనంతరం, అందు బాటులో ఉన్న థీమ్‌ల నుండి ఒకటిని ఎంచుకుని దానిపై ప్రాజెక్టులు రూపొందిం చాలన్నారు. బృందం వారు రూపొందించిన ప్రాజెక్టును పోర్టల్‌లో అప్లోడ్ చేయా న్నారు. అప్లోడ్ చేసిన ప్రాజెక్టును సంబంధిత ఉపాధ్యా యుడు ఆమోదించాలన్నారు. చివరిగా విద్యార్థిని విద్యార్థు లు పోస్ట్ సర్వే పూర్తి చేయాలన్నారు. ఈ మొత్తం ప్రక్రియ నవంబర్ 30, 2024 నాటికి పూర్తి కావాలన్నారు. ఈ కార్యక్రమం విద్యార్థులలో సైంటిఫిక్ ఆలోచనలు అభివృద్ధి చేయడానికి సృజనాత్మక ఆలోచనలకు ప్రోత్సహించడానికి, సామాజిక సమస్యలపై వాస్తవిక పరిష్కారాలను అందించ డానికి ప్రోత్సహిస్తుందన్నారు. ప్రతి బృందం సైంటి ఫిక్ ఐడియాను సకాలంలో పోర్టల్‌లో అప్లోడ్ చేయా లని పాఠశాలల వద్ద కన్సెంట్ టీచర్‌లు విద్యార్థు లకు నిరంతరం మార్గనిర్దేశకత్వం ఇవ్వాలన్నారు. ఈ ప్రక్రి య ద్వారా విద్యార్థుల ఆలోచనా శక్తి , పరిష్కార దృష్టి పెరగనున్నదన్నారు. ఇన్నోవేషన్ మారథాన్ ద్వారా ప్రదర్శించిన ప్రతిభా వంతుల ప్రాజెక్టులు భవిష్యత్ భారత సృష్టికి మేల్కొలు పును కలిగిస్తాయన్నారు. కాబట్టి సంబ ంధిత స్కూల్ టీచర్లు, విద్యార్థులు సమ యానికి తమ ప్రాజెక్టులనుపూర్తి చేయడంలో కృషి చేయాలని డిఇఒ తెలిపారు.